# మధ్వాచార్యులు

వేదవతీ మధ్వగేహులకు కలిగిన కుమారుడు మధ్వాచార్యులు. పరమాత్ముడు ప్రభువనియు, జీవుడు సేవకుడనియు భావించి భక్తిని సలుపుటే మోక్షమునకు మార్గమని బోధించెను. జీవేశ్వరులకు మోక్షమే ఐక్యము గానీ మరి ఏ ఇతరత్ర ఈ రెండింటికిని యేకత్వము లేదని కూడను తెలిపెను. నది, నదిగనే ప్రవహించును. సముద్రము సముద్రముగనే ఉండును. నది వెళ్ళి సముద్రములో చేరిన తదుపరి రెండింటికి భేదముండదనియు, ఇటులనే మానవుడైన జీవుడు మానవునిగనే జీవన ప్రవాహమును జరిపించుచు కడకు దైవమను సముద్రమున చేరునట్టి మార్గమును అనుసరించిన అప్పుడు జీవుడు దేవుడు ఒక్కటి కాగలరు. అంతేగానీ మాటలతో ఏకత్వమును నిరూపించుట బూటకమనే చెప్పెను. ఇతడు నిర్మించిన మతమునే ద్వైతమతమని అందురు. ద్వైతమత స్థాపకుడు మధ్వాచార్యులు.

మధ్వాచార్యులు. కేవలము భక్తిజ్ఞానములు మాత్రమే ఆధారము చేసుకొన్నంత మాత్రమున మానవుడు తన తత్త్వాన్ని తాను యేమాత్రమును గుర్తించుకోలేడనే ఉద్దేశ్యమును పురస్కరించుకొని, తాను ద్వైతమును అనేదానిని స్థాపిస్తూ వచ్చాడు. ఇతను వేదవతి మధ్వగేహుడు అనే వారిద్దరికి పుట్టిన ముద్దుబిడ్డడు. మానవుడు వ్యక్తిత్వాన్ని మరచటంచేత, దైవత్వాన్ని గుర్తించుకోలేని అంధుడుగా మారిపోతాడని, తాను నిరంతరము జీవుడుగానే వుంటుండాలని, పరమాత్ముడు ఎప్పుడూ పరమాత్ముడుగానే వుంటుండాలని, తాను జీవాత్ముడుగా వుండినప్పుడే ఈ పవిత్రమైన ప్రేమతత్త్వము చక్కగా అనుభవించటానికి అవకాశము ఉంటుందనే ఉద్దేశ్యముచేత, ఇతను ద్వైతమనేదాన్ని ప్రచారం చేస్తూ వచ్చాడు. ఇతని ఉద్దేశ్యముకూడను పవిత్రమైన ఉద్దేశ్యమే. ఏమనగా చక్కెరకు చక్కెరయొక్క మాధుర్యము యేమాత్రమూ తెలుసుకోటానికి వీలుకాదు. పరమాత్ముడు చక్కెరవంటివాడు. నేను చీమవంటి వానిగా తయారైనప్పుడే చక్కెరయొక్క మాధుర్యాన్ని చక్కగా చవిచూడటానికి వీలవుతుందనే ఉద్దేశ్యమే ఈ మధ్వచార్యులయొక్క పవిత్ర ఉద్దేశ్యము.